క్లుప్తంగా

వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి



చల్లా వారి వివాహ వేడుకలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: మండలంలోని పోతవరం గ్రామంలో చల్లా వెంకటేశ్వర్లు కుమారుడు విజయ్‌కుమార్ వివాహ వేడుకలకు, కొత్తపల్లి గ్రామానికి చెందిన రాచపూడి యోనా వివాహ వేడుకలకు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.



యోనా వివాహ వేడుకల్లో..

వ్యవసాయ వంగడాల విడుదల



రైతులతో మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త రమేష్

దర్శి: వాతావరణంలో వచ్చే 109 రకాల మార్పులను తట్టుకునే వ్యవసాయ వంగడాలను అఖిల భారత వ్యవసాయ మండలిలో ప్రధాని మోదీ విడుదల చేసినట్లు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బి. రమేష్ వెల్లడించారు. స్థానిక కేవీకేలో ఆదివారం వాటిని ప్రదర్శించిన అనంతరం మాట్లాడారు. కొత్తగా విడుదల చేసిన బయో పోర్టిఫైడ్ వంగడాల గురించి వివరించారు. వీటివల్ల అధిక దిగుబడితో పాటు పురుగులు, తెగుళ్ల నివారణ, వాతావరణ మార్పులకు తట్టుకొనే శక్తి ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడితో పోషక విలువలు గల ఉత్పత్తులు పొందవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎం. శివ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

కొమరోలు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 3 రోజులపాటు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి 14వ తేదీ వరకు మండలంలోని 14 పంచాయతీల సర్పంచ్‌లకు, 13 మంది గ్రామ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఉంటాయని, ఈ శిక్షణ కార్యక్రమాల్లో మధ్యాహ్నం భోజనవసతి ఏర్పాటు చేశామని తెలిపారు. తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

పెద్దారవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంపీడీఓ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వీధిదీపాలు, పారిశుద్ధ్యం అంశాలపై మూడు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

సార్.. బస్ ఎప్పుడొస్తుంది?

- పెద్ద దోర్నాల బస్టాండ్‌లో సమాచార లోపం
- కంట్రోలర్ లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు
- ఏ బస్సు ఎప్పుడు వస్తుందో చెప్పేవారేరీ?
- బస్ వివరాల బోర్డు కూడా లేని వైనం



ఆటోలతో నిండి ఉన్న పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

పెద్దదోర్నాల:

మండల కేంద్రమైన పెద్దదోర్నాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రముఖ శైవ క్షేత్రం అయిన శ్రీశైలానికి వెళ్లేందుకు ఇది ముఖ ద్వారంగా ఉంటుంది. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడ సేదతీరిన తర్వాతే ఘాట్ రోడ్డు ద్వారా శ్రీశైలానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఇంత ప్రాముఖ్యత ఉన్న పెద్దదోర్నాలలో బస్టాండ్‌లో మాత్రం వసతుల లేమితో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్టీసీ బస్టాండులో కనీస సౌకర్యాలు లేవు. నిత్యం వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తున్నా ఇక్కడ ఒక్క కంట్రోలర్‌ను సైతం నియమించలేదు. మొన్నటిదాకా కంట్రోలర్‌గా విధులు నిర్వహించిన ఓ ఉద్యోగి ఇటీవలే పదవీ విరమణ చేశారు. అయితే ఆ ఖాళీని ఇప్పటికీ భర్తీ చేయలేకపోయారు. రాష్ట్రంలోనే 24 గంటలు బస్సు సర్వీసులు నడిచే జంక్షన్‌గా పెద్దదోర్నాలకు పేరుంది. రాష్ట్రంలోని అన్ని సుదూర ప్రాంతాలకు ఇక్కడి నుంచి బస్సు సర్వీసులున్నాయి. అలాగే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎన్నో సర్వీసులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ద్వాదశ జ్యోతిర్లింగంగా, అష్టాదశ శక్తి పీఠంగా వెలుగొందుతున్న శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న పెద్దదోర్నాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే కారణంగా బస్టాండ్ నిర్మాణం జరిగింది. కానీ బస్సుల వివరాలు తెలిపే కంట్రోలర్ లేకపోవడంతో కనీసం మార్కాపురం, దోర్నాలకు తిరిగే బస్సుల సమయాలు కూడా తెలియడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

సుదూర ప్రాంతాలైన తిరుపతి, విశాఖపట్నం బెంగళూరు, భద్రాచలంతో పాటు, శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే బస్సుల వేళలను తెలిపే బోర్డును కొందరు ఆకతాయిలు తొలగించారు. ఇది యాత్రికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది.

బస్టాండ్‌లో ఆటోల హల్‌చల్

బస్టాండ్‌లో కంట్రోలర్ లేక పోవడంతో ఆటోల హడావిడి ఎక్కువైంది. నేరుగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోకే ఆటోవాలాలు వచ్చేస్తున్నారు. ఆర్టీసీ ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకుని జర్రున వెళ్లిపోతున్నారు. ఇది ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నా.. అజమాయిషీ చేసే అధికారులు కానరావడంలేదు.

> **చర్యలు తీసుకుంటాం**
> ఈ సమస్యలను మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ నరసింహులు దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్‌ను నియమిస్తామని తెలిపారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.
> నరసింహులు, మార్కాపురం ఆర్టీసీ డిపో మేనేజర్

అరుస్తా.. కరుస్తా!



బస్టాండ్ సెంటర్‌లో ద్విచక్ర వాహనాలకు అడ్డంగా వెళుతున్న కుక్క



పోలీస్ స్టేషన్ బజారులో శునకాల గుంపు

- స్వైరవిహారం చేస్తున్న శునకాలు
- పిల్లలు, పెద్దలపై దాడులు

దొనకొండ: మండలంలోని అన్ని పంచాయతీల్లో కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వాటి దెబ్బకు జనం బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. పిల్లలు ఉదయం పాఠశాలలకు వెళుతుంటే వారిని వెంటబడి దాడులు చేస్తున్నాయి. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ద్విచక్ర వాహనాలకు అడ్డు రావడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంపులుగా చేరి అరుస్తూ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. గ్రామ పంచాయతీల అధికారులు వాటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



అలంకరణలో శ్రీ వేనూతల కాటమరాజు స్వామి

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయితీలో నల్లమల అడవిలో వెలసిన శ్రీ వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన శ్రీ అంకాళమ్మ దేవతకు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఆలయం ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి స్వామి వారికి సమర్పించారు. అంకాళమ్మ దేవతకు పసుపు, కుంకుమ, గాజులు, చీరలు మహిళలు కానుకగా ఇచ్చారు. కాటమరాజు ఆలయం చుట్టూ యాదవులు భక్తిశ్రద్ధలతో బొల్లావును నెత్తిన పెట్టుకుని తప్పెట్లతో ఊరేగింపు చేశారు.

అందరి కంట కన్నీరు

- ఎండు ముఖం పట్టిన చెరువులు
- దాహార్తిలో మూగజీవాలు
- పంట కోసం రైతన్నల ఎదురు చూపులు



చుక్కనీరు లేక ఎండిపోయిన చింతలపూడి చెరువు



పూర్తిగా ఎండిపోయిన ఉమామహేశ్వరపురం చెరువు

ముండ్లమూరు: మండలంలోని పలు చెరువులు ఎండి పోవడంతో తాగేందుకు నీరు లే మూగజీవాలు అల్లాడుతున్నాయి. సాగు నీటి కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. సాగర్ జలాలు వృథాగా పోతుండడంతో చెరువులు నింపాలని పలు మార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది విపరీతమైన ఎండలకు ఉమామహేశ్వరపురం, చింతలపూడి, ఈదర, కొమ్మవరం, పెద ఉల్లగల్లు, పూరిమెట్ల చెరువులు పూర్తిగా ఎండి పోయాయి. దీంతో పశువులకు తాగేందుకు చెరువులలో నీరు లేకపోవడంతో అల్లాడి పోతున్నాయి. ఇటీవల తాగు నీటి అవసరాల కోసం సాగర్ జలాలు వదిలారు. ఇంతలో ఎగువున వరదల కారణంగా శ్రీశైలం డ్యాం నిండటంతో దిగువన ఉన్న నాగార్జున సాగర్‌కు జలాలు వదిలారు. దీంతో నాగార్జున సాగర్ డ్యాం నుంచి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో సాగర్ జలాలుతో గ్రామాల్లో చెరువులు నింపాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రైతులు వరినార్లు పోస్తున్నారు. చెరువుల్లో చుక్క నీరు లేక పోయినా సాగర్ జలాలు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో గడ్డి రావడంతో పశుపోశకులు మంచి రోజులొచ్చాయని సంతోషంలో ఉన్నారు. కానీ చెరువుల్లో చుక్క నీరు లేకపోవడంతో వాటికి తాగు నీరు దొరకని దుస్థితి నెలకొంది.

> **ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం**
> మండలంలో చెరువులకు నీరు లేదని కొందరు గ్రామస్తులు మా దృష్టికి తీసుకు వచ్చారు. సమస్యను ఉన్నతాధికారులకు తెలిపాను. ఆదేశాలు రాగానే చెరువులను సాగర్ జలాలతో నింపుతాం.
> అక్బర్ బాషా, ఎస్ఎస్‌పీ డీఈ

> **అధికారులు పట్టించుకోవడం లేదు**
> 
> చెరువులను సాగర్ జలాలతో నింపాలని ఎస్ఎస్‌పీ అధికారులకు వినతి పత్రం అందజేసినా పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో రైతులు నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారు.
> కంచుమాటి శ్రీనివాసరావు, వేములబండ

> **బోర్ల కింద పోసిన నారును కాపాడుకోవాలి**
> 
> సాగర్ జలాలు వస్తాయనే ఆశతో చెరువుకు సమీపంలో బోరు కింద నారు పోసుకున్నా. సాగర్ జలాలతో చెరువులు నింపితే సాగుకు అనుకూలంగా ఉంటుంది.
> కె. జక్రయ్య, ఉమామహేశ్వరపురం

> **మూగజీవాలు అల్లాడుతున్నాయి**
> 
> పశువులకు పొలాల్లో తాగేందుకు నీరు లేక పోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. చెరువుల్లో చుక్క నీరు లేకపోవడంతో మూగజీవాలు అల్లాడి పోతున్నాయి. పొలం నుంచి ఇంటికి చేరితేనే పశువులకు నీరు దొరుకుతుంది.
> గూడాల గాలిరెడ్డి, పశుపోషకుడు

ప్రమాదకర బోరుకు కంచె ఏర్పాటు



మూత ఏర్పాటు చేయకముందు..



తర్వాత ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామ సమీపంలో పెదారికట్ల వెళ్లే రహదారి పక్కన పొలంలో ప్రమాదకరంగా ఉన్న బోరుపై ఆదివారం 'సాక్షి'లో 'ఎప్పుడు ఏం జరుగుతుందో' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న డీప్ బోరును కొనకనమిట్ల ఎస్సై కె.మాధవరావు పరిశీలించారు. రైతు బాలయ్యకు అవగాహన కల్పించి, బోరుపై మూత ఏర్పాటు చేయడంతోపాటు కంప వేయించారు.

గ్రామాల్లో అనవసర వివాదాలొద్దు



మునగపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

కొనకనమిట్ల: చిన్నచిన్న విషయాలకు గొడవలు పడకుండా ప్రశాంతంగా జీవించాలని, కొత్త చట్టాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మాధవరావు సూచించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని మునగపాడు గ్రామంలో పర్యటించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. కొత్త చట్టలు, న్యాయపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ కలిసి మెలసి ఉండాలని కోరారు. అనంతరం జాతీయ రహదారిపై కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్సై గోపాలకృష్ణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

జూదరుల అరెస్ట్

గిద్దలూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న 10 మందిని స్థానిక సీఐ వైవీ సోమయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో సీఐ తన సిబ్బందితో సహా సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.10,800 స్వాధీనం చేసుకున్నారు.

ఐదుగురు జూదరులు

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల సమీపంలోని పొలాల్లో ఆదివారం స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న 5 గురు వ్యక్తులను అరెస్టు చేసి 320 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మధుసూదన్‌రావు మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జెడ్పీ బాలుర పాఠశాలలో వృద్ధుడు మృతి

మార్కాపురం టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం సుమారు 80 ఏళ్ల వయసున్న వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి ఫొటోను పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో మధ్యాహ్నానికి కుటుంబ సభ్యులు గుర్తించారు. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన ఈశ్వర్‌రెడ్డి ఇటీవల పెన్షన్ తీసుకొని కాశీనాయన ఆశ్రమానికి వెళ్లాడని, అక్కడ నుంచి వస్తూ స్కూల్లో సేద తీరేందుకు ఆగి, అనారోగ్య సమస్యతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎస్సై అప్పగించారు.

వైఎస్సార్ సీపీ నేత పోలయ్యకు ఘన నివాళి

మార్కాపురం రూరల్: మండలంలోని చింతగుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భర్త పోలయ్య మృతదేహానికి ఆదివారం మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్.మాలకొండయ్య, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మల్లికార్జున్, కొండేపల్లి ఎంపీటీసీ సభ్యుడు కుందురు మల్లారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



అధ్వానంగా ఉన్న ఇరిగేషన్ కార్యాలయం పరిసరాలు



ఆర్అండ్‌బీ కార్యాలయం

ఇవి ప్రభుత్వ కార్యాలయాలే!



డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఇలా..

కంభం:

ప్రభుత్వ కార్యాలయాల చిల్లచెట్లకు ఆవాసాలుగా మారుతున్నాయి. మండల కేంద్రమైన కంభం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ కందులాపురం కూడలిలో కొలువై ఉంటాయి. ముఖ్యంగా ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయాల పరిసరాలు చిల్లచెట్లతో నిండిపోయాయి. ఆవులు, కుక్కలు, ఇతర జంతువులకు ఆవాసాలుగా మారాయి. పలు ప్రభుత్వ కార్యాలయాలైతే మందుబాబులు అడ్డాగా కూడా మారాయి. కార్యాలయ పరిసరాలు అధ్వానంగా ఉండటంతో పరిసరాల్లో పాములు, ఇతర కీటకాలు సంచరిస్తున్నాయని అక్కడికి వచ్చే ప్రజలు చెబుతున్నారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ చిల్లచెట్లతో నిండిపోయి అధ్వాన్నంగా ఉండగా ఇటీవల ఎస్పీ తనిఖీ చేయనున్నట్లు సమాచారం అందడంతో యుద్ధప్రాతిపదికన చెట్లను జేసీబీల సహాయంతో తొలగించి శుభ్రం చేయించారు. మిగిలిన వాటిని ఎప్పటికి పట్టించుకుంటారో చూడాలి మరి.